జాతీయ రహదారిపై నీరు నిలవకూడదు

- తక్షణమే ఆ దిశగా చర్యలు చేపట్టాలి
- నేషనల్ హైవే, ఇరిగేషన్, జీవీఎంసీ అధికారులకు ఆర్డీవో ఆదేశం


సంగివలస చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి

తగరపువలస: జాతీయ రహదారిపై వర్షం, డ్రైనేజీ నీరు నిలవకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి నేషనల్ హైవే, ఇరిగేషన్, జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన సంగివలస చెరువు, సర్వీస్ రోడ్డులోని డ్రైనేజీలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువు నీటిని కొంత మేరకు తగ్గించి బయటకు పంపే మార్గం సూచించాలని ఇరిగేషన్, జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. అలాగే అల్లూరి సీతారామరాజు కాలనీ వద్ద తూమును మూడు అడుగుల కిందకు అయిదు అడుగుల వెడల్పునకు తగ్గిస్తే నీరు బయటకు వెళ్తుందో లేదో పరిశీలించాలని సూచించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఆ శాఖ నిర్మించిన డ్రైనేజీల కింద ఫ్లైయాష్, శ్లాబు నిర్మాణాలకు వినియోగించిన కర్రలు ఉండిపోయాయన్నారు. తక్షణమే వాటిని తొలగించాలన్నారు.

నివేదిక సిద్ధం చేయాలి

డ్రైనేజీల నిర్మాణంలో లోపాల కారణంగా చిట్టివలస విద్యుత్‌శాఖ కార్యాలయం, సంగివలస అండర్‌పాస్‌ల వద్ద సర్వీస్‌రోడ్డులో రోజుల తరబడి నీరు నిలిచిపోతోందని ఆర్డీవో భాస్కరరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. రహదారిపై నీరు నిలువకుండా చేపట్టవలసిన చర్యలను సూచిస్తూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడానికి ఒక నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చెరువు అవుట్‌లెట్లు మూసివేయడం, డ్రైనేజీల నిర్మాణం వల్ల లోపాలు, సర్వీస్‌రోడ్డులో నీరు నిలిచిపోతున్న కారణంగా బోరుబావులు కలుషితమవుతున్నాయని ఆదర్శనగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ, టీచర్స్ కాలనీ, సబ్బివానిపేట వాసులు ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. ఆర్డీవో పర్యటన విషయం తెలుసుకున్న పారిశుద్ధ్య సిబ్బంది చెరువును ఆనుకుని పార్కులో తాత్కాలికంగా తుప్పలు, వాకింగ్ ట్రాక్‌పై మట్టి తొలగించారు. ఆర్డీవోతోపాటు భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, జెడ్సీ బి.రాము, ఇరిగేషన్ ఏఈ, విజయకుమార్, భీమిలి జోన్ ఏఈ సుమన్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జీరు సుజాత, చిప్పాడ వెంకటేష్, కంచుబోయిన వెంకటరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి ఘనంగా పూజలు


ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

భీమునిపట్నం: భీమిలిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బొండా నర్సింహమూర్తి పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం పంపిణీ చేశారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటరమణ, కార్యదర్శి కట్టమూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మార్పణ దినోత్సవం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో వాసవి మాత కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు వాసవి మాతను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి ముప్పంల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'స్పందన'కు విశేషంగా వినతులు


జెడ్సీకి సమస్యలు వివరిస్తున్న చాణక్యపురి లే అవుట్ వాసులు

మధురవాడ: మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 16 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వైఎస్సార్ క్రికెట్ స్టేడియం ఎదురుగా గల చాణక్యపురి ఎక్సైజ్ అండ్ అదర్ సెంట్రల్ గవర్నమెంట్ లే అవుట్ (చాణక్యపురి లే అవుట్ – 1)లో గల 6 కాలనీలకి చెందిన పార్కుకి కాంపౌండ్ వాల్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, జిమ్ ఏర్పాటు, సీనియర్ సిటిజన్స్‌కు సదుపాయాలు కల్పించాలని, ఇతర అభివృద్ధి పనులు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సత్యసాయి సుందర్‌నగర్ లే అవుట్ ఎస్ ఎస్‌కేపీ సీజీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వి.బలరామకృష్ణ, వి.అప్పారావు, చక్రవర్తి తదితరులు వినతిపత్రం ఇచ్చారు. నివాసాల సమీపంలో మురుగునీరు నిల్వ ఉండిపోతోందని, గతంలో కూడా ఫిర్యాదు చేశామని, ఇకనైనా చర్యలు చేపట్టాలని కోరారు. మారికవలసలో అంతర్గత రోడ్ల ఏర్పాటుకు పీఎస్ ధీరజ్, బరియల్ గ్రౌండ్ కోసం పీఎంపాలెంకి చెందిన ఉస్మానియా మసీద్ కమిటీ ప్రతినిధులు, ఉడా కాలనీ ఎల్ఐజీ – 370లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం వినతులు వచ్చాయి. ఎక్కువ మంది ఇంటి పన్నుల కోసం వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీ రమేష్, సూపరింటెండెంట్ అప్పలరాజు పాల్గొన్నారు.

పాలిథిన్ నిషేధంపై ర్యాలీ

తగరపువలస: భీమిలి జోన్‌లో పాలిథిన్ నిషేధంపై అవగాహన ర్యాలీ సోమవారం సాయంత్రం జీవీఎంసీ, స్థానిక వర్తక సంఘం సంయుక్తంగా నిర్వహించింది. బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు నిర్వహించిన ర్యాలీలో పాలిథిన్ వల్ల కలిగే అనర్థాలను ప్లకార్డుల ద్వారా వివరించారు. జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ శంకరరావు, జెడ్సీ బి.రాము, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వర్తక సంఘం అధ్యక్షుడు దుర్గా మురళి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ బొట్టా రవి తెలిపారు. ఈ అంతరాయం కారణంగా తగరపువలస 11 కేవీ ఫీడర్ పరిధిలో రాములమ్మ థియేటర్, బాలాజీనగర్, తాతా థియేటర్ ఏరియా, బంగ్లామెట్ట, గణేష్ థియేటర్ ఏరియా, చిట్టివలస కార్మికవాడ, కొండపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు


మరుగుదొడ్లను పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మి తదితరులు

ఆనందపురం : చాలా కాలంగా ఆ మరుగదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు సర్పంచ్ చొరవ తీసుకొని వాటికి మరమ్మతులు చేపట్టారు. ఆనందపురం పంచాయతీ ఎగువ యాతపేటలో 25 మరుగుదొడ్లు గతంలో నిర్మించారు. అవి పాడవడంతో సర్పంచ్ చందక లక్ష్మి సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చారు. దీంతో ఆ ప్రాంత ప్రజల సమస్య పరిష్కారమైంది. సర్పంచ్ చందక లక్ష్మి, వార్డు సభ్యురాలు కుప్ప కొండమ్మ వాటిని సోమవారం పరిశీలించారు. షిణగం రామారావు, చందక అప్పలస్వామి, చందక శంకరరావు, పోతయ్య పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ


కుసుమాదేవి

పద్మనాభం: విజయవాడలోని ఇందిరా గాంధీ నగర పాలక సంస్థ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అండర్ – 21 శాప్ లీగ్ షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలో పద్మనాభంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయానికి చెందిన ఏడో తరగతి విద్యార్థిని కె.కుసుమాదేవి ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 17 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుసుమాదేవిని స్పెషలాఫీసర్ గ్రేస్ లిల్లీ, పీఈటీ బండారు దేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి

కొమ్మాది: అతివేగం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వల్ల 70 శాతానికి పైగా ప్రమాదాలు జరుగుతున్నాయని, యువత ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు, రోడ్ సేఫ్టీ ఎస్ఐ రాజు సూచించారు. రహదారులపై వాహనదారుల భద్రతకు సంబంధించి కొమ్మాది ఇంజినీరింగు కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడిపి ప్రమాదాలకు గురి కాకూడదని, రహదారి భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. అదేవిధంగా ట్రిపుల్ రైడింగ్ వల్ల ప్రమాదాలకు గురైతే సంబంధిత విద్యార్థులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సింహాచలం: పెందుర్తి మండలం సరిపల్లి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆనందపురం మండలం గండిగుండం పంచాయతీ దబ్బందకు చెందిన లంక సాయికుమార్(22) కొత్తవలస నుంచి పెందుర్తి వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. సరిపల్లి బ్రిడ్జి వద్ద బైకు అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం



ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలో జాతీయ రహదారి పక్కన గ్రామస్తులు నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా శ్రీమాన్ రేజేటి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో గ్రామ అర్చకులు కొత్రా కామేశ్వర రావు విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో సింధూర, తమలపాకులు, నిమ్మకాయలతో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. లెంక రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సహకార సంఘం అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజు, మండల ఉపాధ్యక్షుడు పాండ్రంకి శ్రీను తదితరులు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ రాము


భీమునిపట్నం: భీమిలి జోన్ పరిధిలో అభివృద్ధి పనులు సకాలంలో జాప్యం లేకుండా జరగాలని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆదేశించారు. జోనల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువలు, రోడ్ల నిర్మాణంతోపాటు ఇతర పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు ఎంతో ముఖ్యమని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా చూసుకోవాలని సూచించారు. చాలా ప్రాంతాల్లో రోడ్లను ఇష్టానుసారంగా ఆక్రమించుకుని షాపులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనివల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతోపాటు అందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. ముఖ్యంగా స్పందనకు వచ్చే వినతులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, ఈ విషయంలో అర్జీదారులు అసంతృప్తి చెందకుండా చూసుకోవాలని కోరారు. సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్, టీపీవో ఝాన్సీ, పబ్లిక్ హెల్త్ ఏఈ సుమన్, పారిశుద్ధ్య విభాగం అధికారి మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న సొసైటీ సభ్యులు

కొమ్మాది: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రభుత్వ డ్రైవర్లకు కేటాయించిన ఇళ్ల స్థలాల విషయంలో తలెత్తిన సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెంటనే పరిష్కరించాలని ది విశాఖపట్నం డిస్ట్రిక్ట్ ఏపీ స్టేట్ గవర్నమెంట్ డ్రైవర్స్ మ్యూచివల్లీ ఎయిడెడ్ కో – ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ జె.సత్యనారాయణ కోరారు. పరదేశిపాలెంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. త్వరలో జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఇక్కడకు రానున్నారని, తామంతా ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ త్వరలో కలెక్టర్‌ను కలవనున్నట్లు తెలిపారు. సమావేశంలో 2021 – 22 ఆర్థిక సంవత్సరం ఆడిట్ నివేదిక, జమా ఖర్చులను ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ పి.ఎల్లయ్య, సెక్రటరీ కె.త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న మాజీ కౌన్సిలర్ జీవీ రమణ, సంతపేట వాసులు

తగరపువలస: మరో పదేళ్లపాటు ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంతో భీమిలికి చెందిన పలువురు దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భీమిలి మున్సిపాల్టీ మాజీ కౌన్సిలర్ జీవీ రమణ ఆధ్వర్యంలో సంతపేట వాసులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యత కలిగిన సబ్‌ప్లాన్ ఈ నెల 23తో ముగిసిందన్నారు. దీనిని కొనసాగించేందుకు ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చూస్తే ఆయనకు ఎస్సీ, ఎస్టీల పట్ల ఉన్న ప్రేమ అర్థం చేసుకోవచ్చన్నారు. దళిత కులాల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు పతివాడ రాంబాబు మాట్లాడుతూ సబ్‌ప్లాన్‌ను పొడిగించినందుకు హర్షం వ్యక్తం చేశారు.

లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు సన్నాహాలు

సింహాచలం : సింహగిరిపై లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకి సన్నాహాలు చేస్తున్నట్టు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి తెలిపారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం విజయలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి సింహగిరిపై లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకి పీఆర్వో కార్యాలయం వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు. లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకి కేంద్ర ప్రభుత్వం నుంచి 75 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 25 శాతం నిధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి భర్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, ఏపీ హెచ్‌డీసీ డైరెక్టర్ పైడి రమణ, దయానంద కుమార్, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

అందుబాటులో లింగ నిర్ధారిత వీర్య నాళికలు

మధురవాడ: పెయ్య దూడల ఉత్పత్తి పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ పాడి రైతులకు అందిస్తున్న లింగ నిర్ధారిత వీర్య నాళికలు మధురవాడ పశువైద్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని వైద్యుడు అరుల్ సోమవారం చెప్పారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ 500 డోసులు అందుబాటులో ఉంచామని, ఆసక్తి గల పాడి రైతులు సంప్రదించాలని కోరారు. ముర్రా, జెర్సీ, హెచ్‌ఎఫ్, జెర్సీ క్రాస్, హెచ్‌ఎఫ్ క్రాస్, గిర్, సాహివాల్ జాతులకు చెందిన లింగ నిర్ధారిత వీర్య నాళికలు ఉన్నాయన్నారు. రెండు వీర్య నాళికల ధర రూ.1350 కాగా ప్రభుత్వం రూ.850 సబ్సిడీ ఇస్తుందని, రైతులు రూ.500 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెండు ప్రయత్నాల్లో పశువు గర్భం దాల్చకపోతే రైతు చెల్లించిన మొత్తం తిరిగి ఇచ్చేస్తామన్నారు. పాడి రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్వాతంత్య్రం కోసం నేతాజీ త్యాగం స్ఫూర్తిదాయకం


నేతాజీకి నివాళులర్పిస్తున్న డైట్ విద్యార్థులు


భీమిలి నెహ్రూ ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అనిట్స్ అధ్యాపకులు

భీమునిపట్నం: భారతదేశ స్వాతంత్య్రం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ అందరికీ స్ఫూర్తిప్రదాత అని జిల్లా విద్యాశిక్షణ సంస్థ సీనియర్ అధ్యాపకులు ఎల్.సుధాకర్ అన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రం కోసం బ్రిటిష్ వారిని ఎదిరించడానికి తానే స్వయంగా ఒక సైన్యాన్ని ఏర్పాటు చేసి పోరాడిన వీరుడని కొనియాడారు. అటువంటి గొప్ప నాయకుడిని ఎప్పటికీ మర్చిపోకుండా గుర్తించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జీజీఎస్ నాగేశ్వరరావు, గొట్టేటి రవి, ఎం.మహాలక్ష్మి, ఎస్.త్రినాథరావు, సీఏ సోమయాజులు, జె.మాధవి, పి.హరిణి పాల్గొన్నారు. అదేవిధంగా ఇక్కడి పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎస్ఆర్ కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమితమైన దేశభక్తుడు సుభాష్ చంద్రబోస్

తగరపువలస: అమితమైన దేశభక్తి గురించి తెలుసుకోవాలంటే 'అజాద్ హింద్ ఫౌజ్', 'ఇండియా ఫార్వర్డ్ బ్లాక్' అధినేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని తెలుసుకోవాలని సంగివలస అనిట్స్ ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ సూచించారు. నేతాజీ 126వ జయంతి సందర్భంగా సోమవారం కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశానికి నేతాజీ అందించిన సేవలు, త్యాగాలు ఎప్పుడూ మరచిపోరాదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జి.సూర్యనారాయణ, ఎన్‌సీసీ కేర్‌టేకర్ కె.వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నేతాజీ జీవిత చరిత్రను ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక, విద్యార్థులు నివాళులర్పించారు. భీమిలి హిందీ ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యార్థులు బోస్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆకట్టుకున్న చిత్రకళ ప్రదర్శన

కొమ్మాది: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోష్ జయంతిని పురస్కరించుకుని జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో గల శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో విద్యార్థులు నేతాజీ జీవిత ఘట్టాన్ని వివరిస్తూ చిత్రీకరించిన 125 చిత్రాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను రిటైర్డ్ ప్రొఫెసర్ వి.రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ట్ అనేది అలవాటుగా మలచుకోవాలని సూచించారు. 4 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 75 మంది విద్యార్థులు ఈ చిత్రాలను ఎంతో అద్భుతంగా చిత్రీకరించారని విద్యా నికేతన్ డైరెక్టర్ చిట్టూరు వాసు ప్రకాష్ అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పద్మనాభం: నేతాజీ సుభాష్ చంద్రబోష్ జయంతి సందర్భంగా మండలంలోని ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. రూపాకుల విశాలాక్షి, సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పాడ అప్పారావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, మహంతి అప్పల రమణ, పాలూరి కృష్ణారావు, హంస మహేష్, ఉపాధ్యాయులు విద్యామోహన్, మహేష్ పాల్గొన్నారు.


ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు పంపిణీ చేస్తున్న రవికుమార్


బంగ్లామెట్ట పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు


కొమ్మాది: ప్రపంచ వారసత్వ సాంస్కృతిక నృత్యంగా యునెస్కో గుర్తింపు పొందిన బెంగాలీ కళాకారుల నృత్యం పురూలియా చాహు ప్రదర్శన గీతం విద్యార్థులను, అధ్యాపకులను విశేషంగా ఆకట్టుకుంది. గీతం హెరిటేజ్ క్లబ్, స్పిక్ మేక్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెంగాలీ కళాకారుల బృందం తమాల్ కాంతి రజాక్ నేతృత్వంలో సాంప్రదాయ వేషధారణ, సంగీతంతో పురూలియా చాహు నృత్యాన్ని ప్రదర్శించారు. దుర్గాదేవి వేషధారణతోపాటు శివుడు, రాక్షసులు, అడవి మృగాలను వేదికపై ఆవిష్కరిస్తూ చేసిన నృత్యం ఆహుతులను మైమరిపింపచేసింది. కార్యక్రమంలో గీతం ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు మగ్గం వర్క్‌పై శిక్షణ ప్రారంభం


శిక్షణ ప్రారంభిస్తున్న దివీస్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడలోని దివీస్ లేబొరేటరీ యాజమాన్యం ఔత్సాహికులైన మహిళలకు మగ్గం వర్క్‌పై శిక్షణను సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ప్రారంభించింది. దీనిని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.ఎస్.రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా పలు ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. 90 రోజులపాటు నిర్వహించే శిక్షణకు చిప్పాడ, మూలకుద్దు, పెదనాగమయ్యపాలెం, అన్నవరం పంచాయతీలకు చెందిన 30 మంది మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో దివీస్ సామాజిక బాధ్యత అధికారులు ఇ.ఎస్.నాగరాజు, కె.నరసింహారావు, శిక్షకులు చంద్రకళ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

రూ.17 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం


భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేట శ్మశానవాటికకు రూ.17 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. 20 ఏళ్లుగా ఈ వసతుల కోసం ఇబ్బంది పడుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో శిల్లా వంశీరెడ్డి, చిప్పాడ వెంకటేష్, నమ్మి మాధవ, పీతల వెంకట అప్పారావు, గడిదీసు సూరిబాబు, నమ్మి శ్రీరాములు, కంచుబోయిన వెంకటరావు, చిల్ల సూర్యనారాయణరెడ్డి, సరగడ శివాంజనేయ రెడ్డి, నమ్మి సూరి, మునకాల ఆదినారాయణరెడ్డి, బోర రామారావు, సరగడ నాగిరెడ్డి, పీతల రాజారావు, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.